క్లుప్తంగా

నూతన పైపులైన్లకు శంకుస్థాపన



పట్నంబజారు: గతంలో ఏర్పాటు చేసిన పైపులైన్లు శిథిలావస్థకు చేరి తాగునీరు కలుషితమవుతున్న దృష్ట్యా నూతనంగా ఏర్పాటు చేస్తున్నామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. నియోజకవర్గంలోని 56వ డివిజన్ నెహ్రూనగర్‌లో రూ. 42లక్షలతో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్లకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన పైపులైన్లు సైడు కాల్వల్లో ఉన్నాయని, లీకులతో కలుషిత నీరు సరఫరా అవుతోందన్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు నూతన పైపులైన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ, వైఎస్సార్ సీపీ నేతలు నారకట్ల శ్రీనివాసరావు, అయిశెట్టి శ్రీనివాస్, నాగరాజు, ఉమ, మల్లికార్జునరావు, వెంకట్రావు, సూర్యనారాయణ, ఆచారి, వాసు, అబ్దుల్ సలామ్ పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

పాత గుంటూరు: మార్చి 7న పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అరుణాచలంలోని గిరి ప్రదక్షిణకు గుంటూరు–2 డిపో నుంచి రెండు స్పెషల్ హైటెక్ బస్సుల్ని ఏర్పాటు చేసినట్లు మేనేజరు షేక్ అబ్దుల్ సలాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులు మార్చి 5న రాత్రి 9:15, 9:30 గంటలకు గుంటూరులో బయలుదేరి కాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించి, మార్చి 6న సాయంత్రం అరుణాచలం చేరుకుంటాయని ఆయన పేర్కొన్నారు. అరుణాచలేశ్వరుని దర్శించుకొని మార్చి 7న సాయంత్రం బయలుదేరి 8న ఉదయం 6:30 గంటలకు తిరిగి గుంటూరు చేరుతాయని వివరించారు. ఒక్కో టికెట్ ధర రూ. 2400 ఉంటుందని తెలిపారు. అదనపు సమాచారం కోసం 9959225421 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సచివాలయాల సెక్రటరీలు సస్పెన్షన్

నెహ్రూనగర్: ఆస్తి పన్ను వసూలులో వెనుకబాటు, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ముగ్గురు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులను నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం సస్పెండ్ చేశారు. మరో ముగ్గురు అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న 86, 83 వార్డు సచివాలయాల ఇంచార్జి అడ్మిన్ కార్యదర్శి కె.సత్య శ్రావణి, 38, 41 సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులు రాధిక మారాసు, బొడ్డు రజనీని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆకుల శ్రీనివాసరావుకు, 122, 80, 170 వార్డ్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. సదరు కార్యదర్శులు పన్ను వసూలు విధుల్లో లేకపోవడం, జాబ్ చార్ట్ ప్రకారం యూనిఫారం ధరించకుండా ఉంటున్నారని చెప్పారు. మార్చి నాటికి ఆస్తి పన్ను నూరు శాతం వసూలు కావాల్సిందేనని, నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



నెహ్రూనగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి సూచించారు. కృష్ణా రివర్ క్రాస్ స్విమ్మింగ్‌లో తృతీయ బహుమతి పొందిన హర్షవర్ధన్ రాజును సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా ఆటలు ఆడటం ద్వారా సంపూర్ణ మానసిక, శారీరక దృఢత్వం పొందుతారని తెలిపారు. హర్షవర్ధన్ రాజుకు శిక్షణ ఇచ్చిన ఖాజా మొహిద్దీన్‌ను అభినందించారు

ఆధునిక బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక బోధనపై సోమవారం గోరంట్లలోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల గణిత, సైన్సు ఉపాధ్యాయులు హాజరయ్యారు. తరగతి గదిలో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి 35 మంది ఉపాధ్యాయులు హాజరు కాగా, పాఠశాల డైరెక్టర్ కె. శ్రీకాంత్‌బాబు, గుంటూరు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్పందనలో ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఇందులో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గతవారం ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వారి నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరిస్తూ, నిర్దేశిత గడువులోనే పరిష్కరించాలని చెప్పారు. అనంతరం ఫిర్యాదికి కూడా సమాచారాన్ని అందించాలని సూచించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని ఆదేశించారు. సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రతి సోమవారం నోడల్ అధికారులతో సచివాలయ పనితీరుపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 56 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి– 17, ఇంజినీరింగ్ విభాగానికి– 16, ప్రజారోగ్య విభాగానికి– 8, రెవెన్యూ విభాగానికి– 11, ఉపా సెల్ విభాగానికి – 1, అకౌంట్స్ విభాగానికి– 3 చొప్పున ఫిర్యాదులు అందాయని కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఆర్ఓలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: అరండల్ పేట 4వ లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ప్రధానార్చకుడు మత్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో శ్రీచక్ర అభిషేకాలు, నిత్య పూజల అనంతరం భక్తిశ్రద్ధలతో వేదమంత్రాల నడుమ సిద్ధిబుద్ధి సమేత గణపతి కల్యాణం నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, రక్షాధారణ, నవగ్రహారాధన, మాంగల్య పూజ వంటి అనేక కార్యక్రమాలతో కనులపండువగా కల్యాణాన్ని జరిపారు. మహాహారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పలువురు దంపతులు, భక్తులు పాల్గొన్నారు. మంగళవారం శ్రీ ఆదిలక్ష్మీ కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు ప్రసాద్ తెలిపారు.

జెడ్పీని సందర్శించిన కేంద్ర అధికారుల బృందం

మిషన్ కర్మయోగిలో భాగంగా కార్యక్రమాల పరిశీలన



అధికారుల బృందంతో సమావేశమైన జెడ్పీ చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈవో మోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: మిషన్ కర్మయోగి కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్ సంస్థల్ని పరిశీలించేందుకు ఎక్స్‌ప్లోజర్ విజిట్స్ కింద కేంద్ర అధికారుల బృందం సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులైన రమిత్ మౌర్య, నిలయ్ కుమార్ సింగ్, సత్యేంద్ర ఝాతో జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈవో జె. మోహనరావు సమావేశమై జెడ్పీ పరిపాలన, సంక్షేమ కార్యక్రమాలను గురించి వివరించారు. జెడ్పీ స్టాండింగ్, జనరల్ బాడీ సమావేశాల నిర్వహణతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలు, టెన్త్ విద్యార్థులకు జెడ్పీ నిధులతో ఉచితంగా పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్, అల్పాహారం గురించి అధికారులకు తెలియజేశారు. 15వ ఆర్థిక సంఘ నిధుల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని వారి దృష్టికి తెచ్చారు. గ్రామ పంచాయతీల ఆర్థిక ప్రణాళికలపై సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలకు శిక్షణ కల్పించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో శిక్షణ వివరాలను నమోదు చేసిన తీరును పరిశీలించారు. జిల్లాలో అమలు జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జెడ్పీ పరిపాలనపై అధికారులు ప్రశంసలు కురిపించారు. సమావేశంలో డీపీఆర్‌సీ జిల్లా సమన్వయకర్త పీఎస్ పద్మాకర్, ఇన్‌చార్జ్ అకౌంట్స్ అధికారి జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న పాత నేరస్తుడి అరెస్టు

రూ.2.50 లక్షల విలువైన 255 మద్యం సీసాలు స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మహేష్

నగరంపాలెం: తెలంగాణ మద్యం సీసాల్ని తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్న పాత నేరస్తుడ్ని ఎస్ఈబీ గుంటూరు–1, డీఎస్ఈటీ బృందం సంయుక్తంగా అరెస్ట్ చేసింది. అతని నుంచి రూ.2.50 లక్షలు ఖరీదు చేసే 255 ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బ్రాడీపేటలోని ఎస్ఈబీ గుంటూరు–1 స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఏఎస్పీ డీఎస్.మహేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో ఆదివారం రాత్రి గుంటూరు నగరంలోని అంబేడ్కర్‌నగర్ ఆరో వీధిలో అద్దెకు ఉంటున్న కుక్కల మురళీకృష్ణ ఇంట్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వివిధ బ్రాండ్‌ల మద్యం సీసాలు దొరికినట్లు చెప్పారు. వివిధ మార్గాల్లో గుంటూరు తీసుకువచ్చేవాడని విచారణలో వెల్లడైనట్లు ఆయన తెలిపారు. గతంలోనూ రెండుసార్లు ఎస్ఈబీ–1 గుంటూరు పోలీసులకు మద్యం సీసాలు విక్రయిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. నేరస్తుడు పశ్చిమ గోదావరి జిల్లా పాడూరు పెదపాలెం గ్రామం నుంచి గుంటూరుకి వలసగా వచ్చి ఆర్టీసీ కాలనీలో తొలుత అద్దెకు ఉండేవాడని తరువాత అంబేడ్కర్‌నగర్‌కు మకాన్ని మార్చినట్లు చెప్పారు. లాక్‌డౌన్ నుంచి విక్రయాలు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కేసుని ఛేదించిన ఎస్ఈబీ, డీఎస్ఈటీ సిబ్బందిని ఏఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ, ఏఎస్ కె.మణికంఠ, ఎస్ఈబీ గుంటూరు –1 సీఐ ఎం.రమేష్, డీఎస్ఈటీ సీఐ టీపీ నారాయణస్వామి, ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుళ్లు టి.పోతురాజు, సీహెచ్.రాజు, కానిస్టేబుళ్లు కె.రవీంద్రరెడ్డి, టి.నాగరాజు, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘనంగా అవగాహన సంస్థ వ్యవస్థాపక దినోత్సవం



మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావును సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో సోమవారం అవగాహన సంస్థ వ్యవస్థాపక దినోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.ఎస్.దీక్షిత్ అధ్యక్షతన నిర్వహించారు. 31 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని 32వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న అవగాహన సంస్థ గుంటూరు ప్రజల గుండె చప్పుడుగా చెప్పుకోవచ్చని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత వాణిజ్య పన్నుల శాఖ డెప్యూటీ కమిషనర్ వేదయ్య, సీనియర్ సిటిజన్స్ నాయకులు ఎస్.తిరుపతయ్య, డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, వాస్తు సిద్ధాంతి తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఉపాధ్యక్షుడు విజయబాబు, తదితరులు ప్రసంగించారు. అవగాహన సంస్థకు అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావును సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.

సృజనాత్మకతకు అద్దం పట్టిన సైన్స్ ఎగ్జిబిషన్



దేవతామూర్తుల వేషధారణ ధరించిన విద్యార్థులతో కన్న మాస్టారు, రామారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సృజనాత్మకతకు సైన్స్ ఎగ్జిబిషన్ అద్దం పట్టిందని కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు పేర్కొన్నారు. పాత గుంటూరులోని కన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన విద్యా, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ అంశాల నమూనా ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల శివపార్వతులు, దేవతామూర్తుల వేషధారణ అలరించింది. ఈ సందర్భంగా కన్న మాస్టారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో 600 రకాల సృజనాత్మకత అంశాల్లో 1,200 మంది విద్యార్థులు భాగస్వాములు కావడం గొప్ప విషయమని తెలిపారు. ప్రదర్శన తిలకించిన నగరపాలకసంస్థ కార్యదర్శి రామారావు మాట్లాడుతూ శాస్త్రీయ ప్రదర్శనలతో పాటు పౌష్టికాహారం, మంచి అలవాట్లు, కంప్యూటర్ల వినియోగం వంటి అంశాలతో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి. లక్ష్మణరెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని ప్రత్యర్థులు దాడి చేసి గాయపరిచిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీ అగ్రహారం 12వ లైనులో నివసించే గాజుల నాగరాజు కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. గతంలో అతడికి బ్రహ్మంతో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 23న నాగరాజు ఓ హోటల్ వద్ద ఉండగా బ్రహ్మం, అతని అనుచరులు నలుగురు దాడి చేసి కొట్టి గాయపరిచారు. జీజీహెచ్‌లో చికిత్స అనంతరం నాగరాజు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

చోరీ చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తిని అపార్టుమెంటు వాచ్‌మన్, అతని భార్య పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోబాల్ట్‌పేట 8వ లైనుకు చెందిన కర్నాట శివాజీ బ్రాడీపేట 6/15లోని ఓ అపార్టుమెంటుకు ఆదివారం అర్ధరాత్రి వెళ్లాడు. మెయిన్ గేటు తాళాలు పగులగొట్టి లోపలకు వెళ్లి, వాచ్‌మన్ రూంలో చోరీకి యత్నించాడు. అలికిడికి వాచ్‌మన్ బ్రహ్మేశ్వరావు, భార్య లేచి శివాజీని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సోమవారం అతడ్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

దంపతులను దూషించిన వ్యక్తిపై కేసు

రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దంపతులను దూషించాడు. ఈ ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కాకుమాను వారి తోట 5వ లైనుకు చెందిన శ్రీనివాసరావు, అతడి భార్య సునీతలు కారులో ప్రయాణిస్తుండగా లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న దాసరి సందీప్ శ్రీనివాసరావు దంపతులతో గొడవ పడి పరుష పద జాలంతో దూషించాడు. సునీతను చేతితో నెట్టి చంపుతానని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 30 సంవత్సరాల వయ స్సున్న వ్యక్తి ఈనెల 23న జీజీహెచ్‌లో చేరాడు. అక్కడే చికిత్స పొందుతూ 24న మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831320 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మంద కృష్ణ మాదిగపై వ్యాఖ్యలు సిగ్గుచేటు

నెహ్రూనగర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై నాయకుడు బ్రహ్మయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు ఖండించారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతగానో పోరాటం చేస్తున్న కృష్ణ మాదిగపై అనుచితంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్గీకరణ అంశంపై రాజకీయాలు తిరుగుతున్న నేపథ్యంలో మాదిగలంతా ఏకమై దాన్ని సాధించుకోవాలే తప్పా, భేదాభిప్రాయాలు పెంచుకో కూడదని సూచించారు.


డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



సమావేశంలో బుజ్జిబాబు, కృష్ణకాంత్, కిరణ్ కబీర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎస్. బుజ్జిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బ్రాడీపేటలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి 2008లో మెగా డీఎస్సీ ద్వారా దాదాపు 50వేల పోస్టుల్ని భర్తీ చేసి, వేలాది మంది నిరుద్యోగుల్ని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మార్చారని తెలిపారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చేసిన పాదయాత్రలో భాగంగా ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కోచింగ్‌లు తీసుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్న నిరుద్యోగుల ఆశల్ని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్, ఎం. కిరణ్‌కబీర్ పాల్గొన్నారు.

డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సన్మానం



సన్మానిస్తున్న బీసీ సంఘ నేతలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ జనరల్ సర్జరీ రెండో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను సోమవారం జిల్లా బీసీ సంఘ నేతలు ఆసుపత్రిలో ఘనంగా సన్మానించారు. కడుపులో అరుదైన వ్యాధితో 15 ఏళ్లుగా బాధపడుతున్న గుంటూరుకు చెందిన 65 ఏళ్ల టి.ఎర్రబాబుకు జనవరిలో డాక్టర్ కిరణ్‌కుమార్ ఆపరేషన్ చేసి సమస్య నుంచి కాపాడారు. ఈ నేపథ్యంలో బీసీ సంఘం నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాల్ని ప్రభుత్వం కల్పించిందని, అందువల్లే అత్యాధునిక ఆపరేషన్లను చేయగలుగుతున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆపరేషన్ చేయించుకున్న ఎర్రబాబుతో పాటు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ (మెడికల్) జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతి బాబు, వీరేళ్ల శివనాగేశ్వరరావు, ఎ.రాజేంద్రకృష్ణప్రసాద్, ఎల్.ఆర్.వి. పరబ్రహ్మం, ఎస్.ప్రసాద్, రాధాకృష్ణమూర్తి, పఠాన్ అబ్దుల్‌బాషా, గంగాధర్, రవి, మోహన్‌రావు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట

- ఎంఏఎస్‌వీ నాయకుల హర్షం
- యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభిషేక్ తదితరులు

ఏఎన్‌యూ: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించే దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎంఏఎస్‌వీ(మాదిగ అభ్యుదయ సాధన వేదిక) నాయకులు తెలిపారు. ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో తూర్పు గోదావరి జిల్లా నుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొమ్మి ఇజ్రాయెల్‌కు అవకాశంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యత కల్పించడాన్ని హర్షిస్తూ సోమవారం నాగార్జున యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సీఎం చిత్రపటానికి ఎంఏఎస్‌వీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడతల అభిషేక్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పెద్దపీట వేసేన సీఎం సామాజిక న్యాయ సూత్రాన్ని అంకితభావంతో అమలు చేశారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తూర్పు గోదావరి జిల్లా నుంచి ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా మాదిగల్ని ఎమ్మెల్సీ చేయలేదని, ఆ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. రాజకీయంగా, సామాజికంగా దిగువనున్న వర్గాలకు ప్రోత్సహించడంలో సీఎం ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో బొమ్మి ఇజ్రాయెల్ మాదిగల సమస్యల్ని ప్రత్యేకంగా శాసన మండలిలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీఎంకు ఎంఏఎస్‌వీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బొమ్మి ఇజ్రాయెల్‌ను ప్రోత్సహించిన బాపట్ల ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నందిగం సురేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పి. రోహిణీబాబు, ఎస్. శాస్త్రి, ఎం. చంద్రబాబు, మోహన్, శ్రీను, చొడయ్య, రాజా పాల్గొన్నారు.

పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన



ఎన్‌సీసీ కేడెట్లతో కమాండింగ్ అధికారి వీరేంద్రసింగ్, ఎన్‌సీసీ అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ రాజధాని ఢిల్లీలో గత నెలలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఎన్‌సీసీ గుంటూరు 25 ఆంధ్ర బెటాలియన్ నుంచి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన కేడెట్లను ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ వీరేంద్రసింగ్ సన్మానించారు. కృష్ణనగర్‌లోని ఎన్‌సీసీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ప్రధానమంత్రి ర్యాలీతో పాటు వివిధ పోటీల్లో పాల్గొని బెటాలియన్‌కే గర్వకారణంగా నిలిచారని తెలిపారు. జేకేసీ కళాశాలకు చెందిన కేడెట్ కె. ఏసురత్నం, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీనియర్ అండర్ అధికారి షేక్ అశ్విల్ అహ్మద్, సార్జెంట్ సీహెచ్. రాఘవీలను జ్ఞాపికలతో అభినందించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ విజయ్ మోహిత్, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ టి. సుబ్బారావు, లెఫ్టినెంట్ శివకోటేశ్వరరావు, ఆర్మీ, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లా గ్రంథాలయానికి రీడింగ్ ప్యాడ్స్ అందజేత



బత్తుల దేవానంద్‌కు రీడింగ్ ప్యాడ్లు అందజేస్తున్న దాత అనిల్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఎం. అనిల్‌కుమార్ సోమవారం 35 రీడింగ్ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ పాఠకులకు చదువుకునేందుకు వీలుగా ప్యాడ్స్ ఎంతో సౌకర్యంగా ఉంటాయని తెలిపారు. పాఠకులు, విద్యార్థుల ప్రయోజనార్థం పాడ్లను అందజేసిన దాత అనిల్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, గ్రంథపాలకులు దుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భగవంతుడి సన్నిధానంలోనే మనిషికి శాంతి



ప్రవచనం చేస్తున్న కోటేశ్వరరావు

పాత గుంటూరు: జీవితం నది లాంటిదని, ముందుకు సాగుతూనే ఉంటుందని, కొండలను, రాళ్లను ఢీకొని గుట్టలను దాటి అనేక కాలువలను కలుపుకొని చివరికి సంద్రాన్ని చేరి శాంతిస్తుందని ప్రవచనకర్త కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. జీవితంలో కూడా కష్టసుఖాలు, వాటి మధ్య ఎంతోమందిని కలుపుకొని ప్రయాసపడుతూ చివరికి భగవంతుని చేరటంతో మనిషికి శాంతి లభిస్తుందని ఆయన వివరించారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం సుందర సత్సంగ్, ఆలయ పాలకమండలి సంయుక్త ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామంపై కోటేశ్వరరావు ప్రవచనం చేశారు. ప్రతి దశలోనూ మానవునికి దైవ సహాయం కావాల్సిందేనని తెలిపారు. దైవ నామాలలో శక్తి వైభవం దాగియుందని ప్రవచించారు. నామంతోనే భగవంతుని సాన్నిహిత్యం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి లంకా సూర్యనారాయణ, నూతలపాటి తిరుపతయ్య, సుందర సత్సంగ్ సభ్యులు పాల్గొన్నారు.